షాట్‌పుట్‌లో పాల్గొన్న అంధుడు





వైకల్యం ఓడింది..

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో దివ్యాంగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుల ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా నిలిచింది. క్రీడలు ఆడేందుకు ఒకరునొకరు చేతులు పట్టుకొని అంధ బాలికలు రావడం అందరిని ఆకట్టుకుంది.

6



అమ్మతోడు..

మద్యం ముట్టరు..

ఈ ఊరిలో మద్యం తాగితే అంతే సంగతులు

అమ్మపాలెం ఊరి కథ ఇది

- తాగి ఊగితే వెయ్యి జరిమానా
- కట్టుబాటు.. క్రమశిక్షణ తప్పరు..
- చంద్రబాబు, పవన్ రాక కోసం ఎదురుచూపు

6

కోళ్ల వ్యర్థాల వినియోగం అరికట్టేందుకు..

నిఘా కమిటీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిషేధించిన కోళ్ల వ్యర్థాలను చేపల చెరువుల్లో వినియోగించడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి కె.ఎస్.వి.నాగలింగాచార్యులు తెలిపారు. 'వ్యర్థ చేపలు ' అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆయన కోళ్ల వ్యర్థాల రవాణాను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జీవో నెంబర్ 56 ప్రకారం కోళ్ల వ్యర్థాలను చేపల పెంపకానికి వినియోగించడం, రవాణాను అరికట్టేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్యశాఖ అధికారి, ఎస్ఐ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలతో నిఘా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోళ్ల వ్యర్థాలను వినియోగించకుండా ఫంగస్ చేపల రైతులకు అవగాహన కల్పించాలని మండల ఫిషరీష్ అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు.

ఆక్వాకు ఆక్సిజన్ గండం

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చల్లగాలులు వీస్తుండడంతో రొయ్యలు, చేపల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యలు, చేపలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. కలిదిండి మండలంలో 23 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేపట్టారు. ప్రస్తుతం పలు గ్రామాల్లోని చెరువుల్లో చేపలు, రొయ్యలు పట్టుబడి దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిస్తే ఆక్సిజన్ లోపించి రొయ్యలు, చేపలు చనిపోయి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కొంతమంది రైతులు పట్టుబడి దశలో ఉన్న చేపలు, రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేసి అయిన కాడికి అమ్ముకుంటున్నారు.

ఆక్సిజన్ కొరత నివారణకు చర్యలు

ఆక్సిజన్ కొరత నివారణకు హైడ్రోజన్ పెరాక్సైడ్ చల్లాలని మత్స్యశాఖా భివృద్ధి అధికారి రవికుమార్ తెలిపారు. ఎకరానికి కిలో చొప్పున ఈ మందు పిచికారీ చేయాలన్నారు. చెరువుల్లో ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలన్నారు. ఉదయాన్నే బోట్లను తిప్పుతూ ఆయిలింజన్లతో నీటిని రీ సైక్లింగ్ చేయాలన్నారు. చల్లగా ఉన్నప్పుడు మేత తక్కువగా వేయాలన్నారు.

పర్యాటకానికి.. పునరుజ్జీవం



- రూ.200 కోట్లతో ప్రతిపాదనలు
- టూరిజం హబ్‌గా ఉమ్మడి పశ్చిమ
- పోలవరం నుంచి బియ్యపుతిప్ప వరకు టూరిజం ప్రాజెక్టులు

నరసాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి పేరు వినగానే పర్యాటకులకు గుర్తొచ్చేది.. పచ్చదనం, కేరళ తరహా అందాలు, గోదావరి పరవళ్లు, పాపికొండలు, ఆధ్యాత్మికంగా నిలిచే ద్వారకాతిరుమల, భీమవరం మావుళ్ళమ్మ, పేరుపాలెం బీచ్, వశిష్టా గోదావరిలో బోటు ప్రయాణాలు, రిస్టార్ట్. డిసెంబరు, జనవరి నెలలు వచ్చాయంటే తెలుగు రాష్ట్రాల ప్రజలు అరకు అందాలు లేదా గోదావరి జిల్లాల్లో జరిగే కోడిపందాలు తిలకించేందుకు మక్కువ చూపుతుంటారు. రెండు నెలల ముందుగానే రూమ్‌లు బుక్ చేసుకుంటారు. జిల్లాకు పర్యాటకంగా ఇంతటి ప్రాధాన్యత ఉన్నది. ఇక సినిమా రంగానికి కూడా జిల్లా పెట్టింది పేరు. రంగస్థలం వంటి ఎన్నో హిట్ సినిమాలు జిల్లాలో చిత్రీకరించినవే. దానికి అనుగుణంగానే రాష్ట్ర విభజన తరువాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం టూరిజానికి పెద్దపీట వేసింది. పోలవరం నుంచి నరసాపురం మండలం బియ్యపుతిప్ప వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. కొన్ని పనులు చేపట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇవన్నీ నిర్వీర్యమయ్యాయి. ఐదేళ్లు టూరిజం ఊసే లేదు. ఉన్న రిసార్ట్స్ కూడా మూతపడ్డాయి. పర్యాటకంగా జిల్లా వెనుకబడింది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పేరుపాలెం వంటి బీచ్ అంధకారంగా మారింది. కొత్తగా ఒక్క రిసార్ట్ కూడా ఇక్కడ నోచుకోలేదు.

పర్యాటకానికి కూటమి ఊపిరి

రాష్ట్ర అభివృద్ధి పర్యాటక రంగంపై కూడా ఆధారపడి ఉందని భావించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే టూరిజానికి పెద్ద పీట వేసింది. గతంలో ప్రతిపాదించిన పెండింగ్ ప్రాజెక్టులు, వాటి పురోగతిపై ఆరా తీసింది. తాజాగా సోమవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రులు, ఉన్నతాధికారులతో టూరిజం అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమలోని పెండింగ్‌లోని ప్రాజెక్టులకు ఊపిరిపోయనున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే మంగళవారం ఉపముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్‌ను కలిసి రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులతో ప్రతిపాదనలు అందించారు. కేంద్ర సాయంతో టూరిజానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

రాష్ట్ర విభజన తరువాత అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జిల్లాలోని టూరిజం అభివృద్ధికి సుమారు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వాటిలో పెద్ద పీట పేరుపాలెం బీచ్‌కు వేశారు. సుమారు రూ.16కోట్లతో రిసార్ట్ నిర్మాణం, అలాగే 14 ఎకరాల సీఆర్‌జెడ్ భూముల్లో ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో రిసార్ట్ నిర్మాణం, బీచ్‌కు వెళ్లేందుకు వీలుగా భీమవరం, నరసాపురం నుంచి రహదార్ల అభివృద్ధి వంటి పనులు ఉన్నాయి. ఇవి కాకుండా నరసాపురం వద్ద బోట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఇది వైసీపీ హయాంలో మూతపడింది. ఇటు ఆచంట, సిద్ధాంతం వద్ద చేపట్టిన రిసార్ట్ కూడా మధ్యలో నిలిచిపోయాయి. కొల్లేరులో రూ.100 కోట్లతో ప్రతిపాదించిన కాటేజ్, బోట్స్ క్లబ్ అభివృద్ధికి నోచుకోలేదు. పట్టిసీమలో 160 ఎకరాల ఇరిగేషన్ స్థలంలో ప్రతిపాదించిన అగ్రీ టూరిజం కూడా ముందుకు వెళ్లలేదు. గుంటుపల్లి, బుద్ధాకేవ్స్, పోలవరం వద్ద రిసార్ట్ కూడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ప్రతిపాదనలకు మళ్లీ మంచి రోజులు వస్తాయన్న ఆశ ఉమ్మడి జిల్లా వాసుల్లో నెలకొంది.

ప్రతిపాదనలు సిద్ధం

జిల్లాలో టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పోలవరం నుంచి నరసాపురం వరకు ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎన్నో ప్రదేశాలు ఉన్నాయి. పేరుపాలెం బీచ్‌తో పాటు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రిసార్ట్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు దేశ నలుమూలల నుంచి విచ్చేస్తారు. రాష్ట్ర విభజన తరువాత సుమారు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశాం. కొన్ని పనులు ప్రారంభించాం. అయితే వీటిలో చాలా పెండింగ్ పడ్డాయి. మళ్లీ కొత్త ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

– ప్రభాకర్‌రావు, జిల్లా టూరిజం అధికారి

అర్జీలను త్వరితంగా పరిష్కరించాలి

ఏలూరుసిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తోందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీజీఆర్ఎస్ (రెవెన్యూ), ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ వెరిఫికేషన్, వాటర్ టాక్స్ మాడ్యూల్స్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం, ఇళ్ల స్థలాలు, మ్యూటేషన్స్ తదితర అర్జీల పరిష్కార తీరును కలెక్టర్ వివరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ లోపు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

ఏలూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీకి సంబంధించి ప్రతి నెలా 10వ తేదీ లోపు ఖచ్చితంగా అర్హులైన వారి ఇంటింటికీ నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని ఎండీయూ ఆపరేటర్లను జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. పీడీఎస్ బియ్యంతో పాటు తప్పనిసరిగా కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలన్నారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, చౌకధరల దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలు, ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు, సేల్స్ ఆఫీసర్లు, జిల్లా పౌరసరఫరాల కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. డీలర్లు, పీడీఎస్‌కు సంబంధించి నిత్యావసర వస్తువులు విషయమై డీడీలు సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. దీపం-2 పథకం అమలు తీరును సమీక్షించారు. డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ రాజు, డీటీలు, డీలర్లు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుకుందాం..

- రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, నవంబరు 26 : ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా డా.బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించి అధికారులు, సిబ్బందిచే భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులతో పాటు విధులు, బాధ్యతలు గుర్తెరిగి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుకుందామన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యభావాలకు అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తొలుత కలెక్టర్‌తో పాటు డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నాగరాణి, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.





కొబ్బరి కాయల వలుపు కేంద్రాలతో..

ఉపాధి

- ఉమ్మడి పశ్చిమలో వందలాది కేంద్రాలు
- వేలాది మంది కూలీలకు జీవనోపాధి
- బీమా కల్పించాలంటూ విజ్ఞప్తి

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వేలాది మంది కూలీలకు కొబ్బరికాయల వలుపు కేంద్రాలు ఉపాధి కల్పిస్తున్నాయి. కలిదిండి మండలంలో కొబ్బరికాయలు వలుపు కేంద్రాలు విస్తరించడంతో వందలాది మంది కూలీలు నిత్యం ఉపాధి పొందుతున్నారు. ఒక్కొక్క కొబ్బరికాయల వలుపు కేంద్రంలో సుమారు వంద మంది కూలీలు పని చేస్తున్నారు. కొబ్బరికాయల వలుపు సంఖ్యను బట్టి వేతనం ఇస్తున్నారు. ప్రతీ కూలీ రోజుకు సగటున 700 నుంచి 800 వరకు కొబ్బరికాయలు వలవడంతో రోజుకు సుమారు రూ.800 వరకు ఒక్కొక్క కూలీ సంపాదిస్తున్నారు. కోనసీమ కొబ్బరిగా పేరొందిన కలిదిండి మండలంలో కొబ్బరి కాయలకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ వలిచిన కొబ్బరికాయలను ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, అస్సోం రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

కొబ్బరి వలుపులో రకాలు

కొబ్బరికాయల వలుపులో పలు రకాల వలుపులు ఉన్నాయి. సాధారణంగా దేవుడి గుడిల వద్ద ఉండే కొబ్బరికాయల వలుపును గుడ్డు వలుపుగా పిలుస్తారు. ఐదు పేడుల వలుపు, నాగులు పేడుల వలుపు, పీచు అనాం వలుపులుగా విభజించి కొబ్బరికాయలను గుట్టలుగా వేస్తారు.

పెంఛన్ ఇవ్వాలి..



కొబ్బరి చెట్లు ఎక్కి కొబ్బరికాయలు కోస్తున్నప్పుడు ప్రమాదవశాత్తూ కిందపడినప్పుడు నడుము విరిగి మంచానికే పరిమితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. కొబ్బరికాయల వలపు కేంద్రాల్లో పని చేసే కూలీలు 50 ఏళ్లు దాటిన తర్వాత పని చేయడం కష్టతరంగా ఉంటోంది. పింఛన్ సదుపాయం కల్పించి ఆదుకోవాలి.

– టి.నాగ ఆంజనేయులు, కూలీ

బీమా సౌకర్యం కల్పించాలి



కొబ్బరికాయల వలుపు కేంద్రాల్లో పని చేసే కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి. కొబ్బరికాయలు వలిసేటప్పుడు ప్రమాదవశాత్తు చేతిలో గునుపం దిగి గాయాలైనప్పుడు ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– బి.నరసింహమూర్తి, కూలీ

ఆర్థిక చేయూత అందించాలి



నాలుగేళ్లుగా కొబ్బరికాయల వలుపు కేంద్రంలో కూలిగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాను. ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందించాలి.

– ఆనంద్, కూలీ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష, రైతు, కార్మిక సంఘం నాయకులు

కదం తొక్కిన రైతులు, కార్మికులు

- రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశవ్యాప్త పిలుపులో భాగంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు కదం తొక్కారు. కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. తొలుత ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక రైతాంగ సమస్యలపై నినాదాలు చేస్తూ, డప్పులు, కళాకారుల నృత్యాలతో నిరసన తెలుపుతూ కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, ఇఫ్టూ నాయకులు ఎస్.రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని విమర్శించారు. రైతులు, కార్మికుల హక్కులు కాలరాసిందని విమర్శించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్న రైతులకు, కార్మికులకు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. సీఐటీయూ నాయకులు సోమయ్య, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ ప్రవేశం లేదు

ప్రవేశ పరీక్ష రాసి ఐదు నెలలు.. కౌన్సెలింగ్ ప్రక్రియ ఎప్పుడు?

7

ఎన్నికల సక్రమ నిర్వహణకు

శిక్షణ దోహదం

డీఆర్వో విశ్వేశ్వరరావు

ఏలూరుసిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సక్రమంగా నిర్వహణకు శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, మైక్రో పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరుగుతాయన్నారు. ఈ విధానంపై ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ సమయంలో పొందిన అంశాలుతో సిబ్బంది ఎటువంటి పొరపాటు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సిబ్బందికి ఏమైనా సందేహాలుంటే వెంటనే శిక్షకుల దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని నివృత్తి చేస్తారన్నారు. మాస్టర్ ట్రైనీ శ్రీనివాసరావు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామగ్రి వినియోగం, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి, స్ట్రాంగ్ రూమ్‌లకు అప్పగించే వరకు ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు , సిబ్బంది చేయాల్సిన పనులపై శిక్షణ అందించారు. సమావేశంలో ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీజన్‌కు ముందే తొందర..



వేసవిలో కాయాల్సిన ముంజులు శీతాకాలంలో కాస్తున్నాయి. ఈ వింత పోకడ చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వేసవిలో కాసిన ముంజులు వర్షాకాలంలో తాటిపండ్లుగా మారుతాయి. ఆ తాటి పండ్లను పాతిపెడితే శీతాకాలం నాటికి తేగలు వస్తాయి ఎన్నో పోషకాలు కలిగిన వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. కానీ ప్రకృతికి విరుద్ధంగా తేగలు వచ్చే కాలంలో తాడిచెట్టుకు ముంజులు కాస్తున్నాయి. కాళ్ళ మండలం జువ్వలపాలెం నుంచి కలవపూడి వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారిలో అన్నయ్యకోడు పంటకాలువను ఆనుకుని ఉన్న తాటిచెట్టుకు ముంజులు విస్తారంగా కాశాయి. ఇంకొకవైపు జువ్వలపాలెం గ్రామంలో రాష్ట్రీయ రహదారి పక్కనే తేగలు అమ్మకానికి పెట్టారు. ఈ వింత పరిస్థితిని రహదారి వెంబడి వెళ్లే వారంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు. - కాళ్ల

జాగ్రత్త గురూ..!



ఏలూరు : వేగంగా వెళ్లే లారీ టాప్‌పై ప్రయాణం.. బీ కేర్‌ఫుల్..

అందరిదీ జీవన పోరాటమే.. బతుకు బాటలో గమ్యం చేరేందుకు నిత్యం సాహసాలు చేయాల్సిందే.. కానీ పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదు.. ఏమాత్రం అదుపుతప్పినా జీవితం తిరగబడిపోతుంది.. జరగరాని నష్టం జరిగితే ఎవరినని ఏమి లాభం.. ?



భీమవరం : హ్యాండిల్ అందడం లేదు.. ఎలా బ్రదర్ !



వైకల్యం ఓడింది..

ఏలూరులో దివ్యాంగులకు ఆటల పోటీలు

ఫిజికల్లీ ఛాలెంజెడ్ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి



ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్లీ ఛాలెంజెడ్ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం వెల్లివిరిసింది. ఆత్మ స్థైర్యం ముందు వైకల్యం ఓడింది.. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో దివ్యాంగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుల ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్ జాతీయ పతాకం,క్రీడా పతాకం ఆవిష్కరించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే దివ్యాంగుల ఆటల పోటీల్లో పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ సాధించాలని, మీ ఉత్సాహం పలువురికి ఆదర్శం కావాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటలపోటీలను లాంఛనంగా ప్రారంభించారు. వైకల్యం ఉన్నప్పటికి ఎన్నో పతకాలు సాధించిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని వైకల్యం అడ్డుకాదని దివ్యాంగుల విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రామ్‌కుమార్ అన్నారు. దివ్యాంగులు క్రీడల్లో ఉత్సాహంగా తమసత్తా చాటారు. షాట్‌పుట్ విసిరారు. పరుగులు పెట్టారు. ద్విచక్రవాహనాలపై పోటీకి దిగారు. రన్నింగ్, చెస్, క్యారమ్, ట్రైసైకిల్, జావెలిన్‌త్రో, వాలీబాల్, షాట్‌పుట్, పలు విభాగాల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు డిసెంబర్ 3న జరిగే కార్యక్రమంలో పతకాలు అందచేస్తారు. వివిధ ప్రాంతాల నుంచి 700 మంది పాల్గొన్నారు. లీడ్‌బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి, ఎన్జీవో హోమ్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభా వంతులు

రేపటి నుంచి గురుకుల విద్యాలయంలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్

పెదవేగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడురోజుల పాటు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని విద్యా లయం ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు జోన్ల పరిధిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, త్రోబాల్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, రన్నింగ్ తదితర పోటీలు ఉంటాయని చెప్పారు. నాలుగు జోన్ల నుంచి దాదాపు 1200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల పరిధిలో జరిగే ఈ క్రీడా పోటీలను ఆ సంస్థ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు ప్రారంభిస్తారని, సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఎవరైనా వేధిస్తే 112 కు కాల్ చేయండి

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఆకతాయిలు మహిళలపై వేధింపులకు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఎవరైనా ఆకతాయిలు వేధింపులు చేస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని అభయ రక్షక మహిళా దళం సభ్యులు సూచించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యా సంస్థల వద్ద, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్దకు అభయ రక్షక మహిళా దళం సభ్యులు వెళ్లి వారికి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే 112కు కాల్ చేయాలని పది నిముషాల్లో తాము వస్తామన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభయ మహిళా రక్షక బృందం

పనికిమాలిన ఆలోచనల వల్ల ఫలితం లేదు



అనుగ్రహ భాషణం చేస్తున్న భారతీ స్వామి

పాలకొల్లు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు భగవంతునిపై దృష్టి సారించాలని, పనికిమాలిన ఆలోచనలు చేయడం, ఇతరులకు హాని కలిగించే పనులు చేయడం వల్ల ఏవిధమైన ఫలితం ఉండదని శృంగేరీ శారదా పీఠం జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. పాలకొల్లు 24వ వార్డులోని శ్రీశంబేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం ఆయన విచ్చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శంబేశ్వర స్వామి, రత్నమాంబ దేవికి, సీతారాములు, శ్రీదేవి, భూదేవి సమేత వేంక టేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భగవంతుని అను గ్రహం ఉంటే ప్రతీ పని విజయవంతం అవుతుందన్నారు. ఆలయ ధర్మాధికారి కలగ గున్నేశ్వర రావు, కలగ మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాంఘిక వైజ్ఞానిక ప్రదర్శన

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రం దినోత్సవం సందర్భంగా చినతాడినాడ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు సాంఘిక వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సుమారు 100 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని సోషల్ ఉపాధ్యాయుడు పి.దామోదర్‌రావు తెలిపారు. సర్పంచ్ జి.ఏసుబాబు, మాజీ సర్పంచ్ యాళ్ల కృపారావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సోర్రా అరవింద్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఆ ఊర్లో ఎవరూ మద్యం ముట్టరు. ఒకవేళ ఎవరైనా కళ్ళుగప్పి నాలుగు చుక్కలేసుకుని ఊళ్లోకి వచ్చి యాగీ చేసినా వెయ్యి రూపాయల పెనాల్టీ. ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా పరిష్కరించుకుంటారు. పోలీస్‌స్టేషన్ గడప తొక్కరు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎవరికి కష్టం వచ్చినా.. నష్టం వచ్చినా ఊరంతా తోడుగా నిలుస్తుంది. ఆఖరికి స్థానిక సంస్థల ఎన్నికల్లోను ఎవరంతట వారు పోటీపడరు. పంచాయతీ ఎన్నికల్లో ఊరిదంతా ఒకే మాట.. ఏకగ్రీవమే.. ఇక్కడ ఆదర్శ రైతులు ఒకప్పుడు సత్కారాలు పొందారు. ఊళ్లో బహిరంగ మల విసర్జన అప్పటి నుంచి ఇప్పటిదాకా నిషేధమే. న్యాయవాదులు, న్యాయమూర్తులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి అభినందించినవారే. గ్రామ పెద్ద పున్నయ్య స్ఫూర్తితోనే ఇదంతా సాధ్యమైతే విజేత యువజన సంఘం అక్షరాలా అమలు చేస్తోంది. ఆ ఊరి కథ కమామిషు ఏమిటో తెలుసుకుందామా..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



అమ్మతోడు..



- ఈ.. ఊరిలో మద్యం తాగితే అంతే సంగతులు
- తాగి ఊగితే వెయ్యి జరిమానా
- కట్టుబాటు.. క్రమశిక్షణ తప్పరు..
- స్థానిక సంస్థల్లోను ఏకగ్రీవమే
- వివాదాలకు చాలా దూరం
- గడిచిన రెండేళ్లలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కేసులు రెండే
- చంద్రబాబు, పవన్ రాక కోసం ఎదురుచూపు

అమ్మపాలెం ఊరి కథ ఇది

ఆ ఊరి జనాభా వెయ్యిలోపే. అంతా రైతువారి కుటుంబాలు. రోజువారి కుటుంబాన్ని సాకేందుకు కాయకష్టమే. కాని నూరుశాతం కట్టుబాటు, క్రమశిక్షణ. ఒకరికొకరు దూషించుకోరు. ఎక్కడా ఎవరూ ఘర్షణలకు దిగరు. చిన్నాచితక కోపతాపాలు వచ్చినా సర్దుబాటు చేసుకుంటారు. తగాదా మరింత వివాదాస్పదమైతే ఊరి పెద్దల తీర్పే శిరోధార్యం. మద్యానికి అత్యంత దూరం. మహిళలకు మరింత గౌరవం. ఇక్కడ కాస్తోకూస్తో చదువుకున్న వారే ఎక్కువ. కాని ఎక్కడా బేషజాలకు పోరు. ఆ ఊరి పేరు జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం.. ఈ ఊరిలో గడిచిన 24 ఏళ్ళుగా మద్యం అమ్మకాలు గాని, మద్యం సేవించేవారికి చోటే లేదు. 24 ఏళ్ళ క్రితం 15 మందితో ఏర్పడిన విజేత యువజన సంఘం దీనికి నాంది పలికింది. ఊరిని చైతన్యపరిచింది. ఆదిలో మీ పెత్తనం ఏమిటని ఎదురు తిరిగినవారు ఉన్నారు. తాగితే తాగుతాం..మా ఇష్టం అంటూ కొందరు ఎదురు తిరిగారు. ఏం చేస్తారో చేసుకోండంటూ సవాళ్లు విసిరారు. కాని రానురాను ఊరి బాగోగుల కోసమే యువకులంతా ఏకమై ఊరి గుట్టు బజారు పాలుకాకుండా శ్రమించారు. తొలుత వ్యతిరేకించిన వారే కొద్దికొద్దిగా మెతకపడడం ప్రారంభించారు. దీనివెనుక గ్రామంలోని మహిళల పాత్ర అత్యంత కీలకం. తమ ఇంట్లో వారు ఎక్కడెక్కడ మద్యం సేవించి వస్తున్నారో ఆరా తీసి మరీ యువజన సంఘానికి ఉప్పందించేవారు. ఇంకే ముంది అంతా ఏకమై చాటుమాటున మద్యం విక్రయించేవారిని చాన్నాళ్ల క్రితమే తరిమేశారు. ఊళ్ళో ఎక్కడా బెల్టు షాపు పెట్టకుండా కఠిన నిర్ణయం అమలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము నమ్మిన సిద్ధాంతానికి ఊరు శాంతి యుతంగా ఉండేందుకు కుటుంబ తగాదాలకు, భూతగాదాలకు, రాజకీయ తగాదాలకు మద్యం కారణం కారాదని దృఢ సంకల్పంతో పట్టువీడకుండా యువజన సంఘం ప్రయత్నించింది.

చుక్క ముట్టుకుంటే.. ఒట్టు

విజేత యువజన సంఘంతో పాటు గ్రామ పెద్దలు నిర్ణయాల మేరకు అమ్మపాలెం గ్రామంలో మద్యం సేవించడం పూర్తిగా నిషేధం. అంతకంటే మించి అమ్మకాలకు తావులేదు. గడిచిన రెండున్నర దశాబ్దాల కాలంగా ఊరు ఊరంతా ఇదే కట్టుబాటు పాటిస్తుంది. ఎన్ని విధానాలు మారినా, మరెన్ని ప్రభుత్వాలు మారినా ఈ ఊరి మాట.. బాట ఒక్కటే. ఎట్టి పరిస్థితుల్లోను మద్యాన్ని సేవిస్తే ఊరి శాంతియుత వాతావరణానికి విఘాతమని భావిస్తారు.. సుమారు 200 గడపలు ఉన్న ఈ

మద్యం ముట్టరు..

గ్రామంలో అత్యధికులకి మద్యం అలవాటే లేదు. కేవలం వ్యవసాయం..కుటుంబ పోషణ అనే రెండు విధానాలు మాత్రమే తెలుసు. అంతకంటే మించి అసాంఘిక కార్యకలాపాలకుగాని, ఇతరత్రా ఘర్షణలకు గాని ఎవరూ తావివ్వరు. ఒకవేళ చాటుమాటున ఎవరైనా మద్యం సేవించి ఊళ్ళోకి వచ్చి వివాదం సృష్టిస్తే మాత్రం వారికి వెయ్యి రూపాయలు పెనాల్టీ. ఈ పెనాల్టీ మొత్తం కట్టి తీరాల్సిందే..మద్యం సేవించిన వ్యక్తికి మద్దతుగా ఎవరూ నిలవనే నిలవరు. ఈ ఊళ్లో బెల్టు షాపు పెట్టేందుకు జరిగిన ప్రయత్నాలన్నింటినీ విఫలం చేశారు. చాన్నాళ్ళ క్రితం ప్రతీ పదకొండేళ్ళకు జరిగే గంగానమ్మ జాతర సందర్భంగా కొందరు ఇక్కడ మద్యం దుకాణం తెరిచేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. దానికి ఊరు ఊరంతా ససేమిరా అంది. బెల్టుషాపు పెట్టాలనుకున్న వారిని తరిమేశారు. దీనికంతటికి అప్పటి గ్రామ పెద్ద సురవరపు పున్నయ్య స్ఫూర్తి. ఆయన కనుసన్నల్లోనే ఊరంతా క్రమశిక్షణతో మెలిగేది. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా, నష్టం వచ్చినా ఊరంతా వాలి పోయేది. అంతలా తీర్చిదిద్దారు పున్నయ్య. ఆ తరువాత కూడా ఎక్కడా ఊరు క్రమశిక్షణ తప్పలేదు.

రాజకీయాలకు చోటు లేదు

అమ్మపాలెంలో ఎక్కడా రాజకీయ తగాదాలకు ఆస్కారమే లేదు. గడిచిన రెండు దఫాలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లోను అంతా ఏకగ్రీవమే. ఏ ఒక్కరు మాకు కావాలంటే.. మాకు కావాలని పోటీలు పడలేదు. అందరూ ఏకతాటిపై నిలిచి ఏకగ్రీవం చేశారు. దీనికితోడు సాధారణ ఎన్నికల్లో రాజకీయ పక్షాలు ఏమైనా ఓట్ల కోసం నోట్లు వల విసిరినా అదే కట్టుబాటు. గ్రామస్తుల్లో అత్యధికులు చేతికందివ్వడానికి వచ్చిన ఓట్ల సొమ్ములను తిరిగి వెనక్కి ఇచ్చేశారు. తమకు ఇలాంటి అరువు అవసరం లేదంటూ నేరుగానే తిప్పికొట్టారు.

ఊరికోసమే అంతా

తాము ఏమి చేయదలచుకున్నా అంతా ఒక్కటై చేస్తారు. ఒకరికొకరు కూడబలుక్కుని తుది నిర్ణయం తీసుకుంటారు. ఆ నిర్ణయానికే అందరూ కట్టుబడతారు. విభేదాల మాట ఇక్కడ వినపడదు. ఆఖరుకి గడిచిన కొన్ని సంవత్సరాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల సంఖ్య ఒకట్రెండు. స్థానికంగా చిన్నచిన్న తగాదాలు, పొలం తగాదాలు, మాట జారిన విషయాలు ఏదైనా సరే అందరు కలిసి కూర్చొని పరిష్కరించుకుంటారు. స్టేషన్ మెట్లెక్కడం వీరికి అలవాటే లేదు. ఆదర్శ గ్రామమంటే ఇలా ఉండాలని అందరికీ అమ్మపాలెం స్ఫూర్తిదాయకమవుతుంది. కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉన్న ఈ గ్రామంలో సమస్యలు మాత్రం అనేకం. మద్యం నిషేధం దగ్గర నుంచి క్రమశిక్షణతో మెలుగుతున్న ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సింది పోయి ఇప్పటికీ చూసీ చూడనట్టుగానే వ్యవహరిస్తున్నారు.

మా ఊరు రండి..

తాము నిక్కచ్చిగా ఊరి కోసం చేస్తున్న ప్రయత్నాలను, వాటి ఫలితాలను స్వయంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తమ గ్రామానికి రావాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఆశించినట్టుగా బహిరంగ మలవిసర్జనను ఇక్కడ నిరోధించాం. ప్రభుత్వపరంగా కార్యక్రమాల అమలులో తప్పు దొర్లకుండా చూస్తున్నాం. వ్యవసాయ పరంగా రైతులకు అందే సహాయాలను పర్యవేక్షి స్తున్నాం. కాని ఇలాంటి ఊరికి కూడా అనేక సమస్యలు న్నాయి. వచ్చీపోయేందుకు రహ దారి అత్యంత ఘోరంగా ఉంది. ఊరి శివారున ఉన్న కాలువ దాటేందుకు కష్టసాధ్యమైన పరిస్థితి నెలకొంది. ఊరి లోపల అంతర్గత రహదారుల అవసరం లేకపోలేదు. ఇలాంటి వన్నీ పూర్తి కావాలి. దూర ప్రాంతాలకు వెళ్ళే పిల్లల చదువులకు ఒకింత ఊతమివ్వాలి. రోజువారి జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతా లకు అవసరాల నిమిత్తం వెళ్ళే ప్రజలకు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ ఊరిని ఆదర్శంగా తీసుకుని ఇప్పటికే న్యాయవాదులు, న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు అనేకమార్లు వచ్చి వెళ్ళారు. ఆదర్శ గ్రామాన్ని ఆదరించండి.. అంటూ గ్రామస్తుల వేడుకుంటున్నారు..

మహిళలు అండగా నిలిచారు



కమిటీ ఏర్పడిన మొదట్లో మద్యం నిషేధించడానికి మూడు సంవత్సరాల పాటు చాలా ఇబ్బందులు పడ్డాం.గ్రామ పెద్దలు, గ్రామస్తులు కొందరు వ్యతిరేకించారు. ఆ సమయంలో గ్రామ మహిళలంతా మాకు తోడుగా నిలబడటం వల్ల నేడు మా గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం చేయగలిగాం. మా కమిటీని సభ్యులను ఆదర్శంగా తీసుకుని గ్రామంలో నలభై మంది యువకులు ప్రతీ నెల కొంత డబ్బు దాచి కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తున్నారు.

జెల్లా సత్యనారాయణ (సాయి) విజేత యువజన సంఘం అధ్యక్షుడు, అమ్మపాలెం

గ్రామంలో వివాదాలకు తావులేదు



విజేత యువజన సంఘం గ్రామంలో చేసే కార్యక్రమాలకు ఆక ర్షితుడినయ్యాను. గ్రామంలో వివాదాలకు తావేలేదు. నా పొలంలోకి వెళ్లడానికి దారి లేకపోవడంతో పక్క భూమి వ్యక్తితో గొడవలు జరుగుతున్న సమయంలో కమిటీ సభ్యులు జోక్యం చేసుకుని వివాదాలు లేకుండా సరిచేశారు. నాకు నా పొలంలోకి వెళ్లడానికి దారి చూపించారు. మొదట తగాదా పడిన ఇద్దరం ఇప్పుడు స్నేహభావంతో ఉంటున్నాం. నేను కూడా గ్రామానికి ఏదో ఒక మంచి పని చేయాలని దృఢసంకల్పంతో ఉన్నాను.

గవిరిశెట్టి రత్తయ్య,టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు

ఒకప్పుడు విపరీతంగా తాగేవారు



1998 కు ముందు మా గ్రామంలో మద్యం అమ్మకాలు విపరీతంగా ఉండేవి. పగలు,రాత్రి తేడా లేకుండా మద్యం తాగుతూ కొందరు గ్రామంలో ప్రశాంతత లేకుండా చేసేవారు. ఇళ్లల్లో ఆడవారిని కొట్టేవారు. ఆ సమయంలో కొంతమంది మహిళలు గ్రామంలో ఉన్న యువకులమైన మా దగ్గరకు వచ్చి తమ సమస్య చెప్పారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరగ కుండా చూడాలని కోరారు. గ్రామ పెద్ద సూరవరపు పున్నయ్య సహకా రంతో ఆనాడు మొదలైన ఉద్యమం గ్రామస్తుల సహకారంతో నేటికీ కొనసాగుతోంది.

సూరవరపు రాంబాబు,విజేత యువజన సంఘం ప్రధాన కార్యదర్శి

నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని తహసీల్దార్ ఎస్‌కె.సుభానీ అన్నారు. ముదినేపల్లిలోని వి.కన్వెన్షన్ హాలులో మంగళవారం మండల పరిధిలోని 13 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమితులైన పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించి వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ, మాస్టర్ ట్రైనీలు నాగేశ్వరరావు, మారుతీ, పీవో, ఏపీవో, ఇతర సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

రాజ్యాంగ స్ఫూర్తికి వందనం

వీరవాసరం (భీమవరం టౌన్) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులు భారతదేశం చిత్రపట ఆకారంలో నిలిచారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయుడు వీరవల్లి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.భారత రాజ్యాంగంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ పోటీలు నిర్వహించి గెలు పొందిన వారికి బహుమతులు అందజేశారు.. ఉపాధ్యాయులు వెంకటాచార్యులు, వి.పూర్ణచంద్రరావు, కాయల వీరాస్వామి, గురుమూర్తి, ఆర్.తులసీ ప్రదీప్, వేణు, సుబ్బరాజు, ప్రసాద్, గజేంద్ర గట్కర్, కుమారి, సూర్యవాణి, అరుణ పాల్గొన్నారు.



నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ డిప్యూటి డైరెక్టర్‌గా

ఉండికి చెందిన నిస్సీ ఫ్లోరా



గోడి నిస్సీఫ్లోరా

ఉండి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదపేటకు చెందిన యువతి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నేషనల్ హార్టికల్చర్ బోర్డు డిప్యూటీ డైరక్టరుగా ఎంపికయ్యారు. నియామక ఉత్తర్వులు అందుకున్న గోడి నిస్సీఫ్లోరా మంగళవారం తల్లిదండ్రులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. నిస్సీ ఫ్లోరా తండ్రి గోడి ఏసు రత్నం విశ్రాంత ఉపాధ్యాయుడు, తల్లి వర్షిని యా భీమవరం ఏరియా ఆసుపత్రి హెడ్ నర్సు గా పనిచేస్తున్నారు. నిస్సీ కృష్ణాజిల్లా కైకలూరు లో పాఠశాల, హైస్కూల్ విద్య పూర్తి చేశారు. తాడేపల్లిగూడెం వెంకట్రామన్నగూడెంలో బీఎస్సీ హార్టికల్చర్, మహారాష్ట్రలోని రావూరి మహాత్మా పూలే కృషి విద్యాపీఠ్‌లో ఎంఎస్‌సి హార్టికల్చర్, వెంకట్రామన్నగుడెంలో హార్టికల్చర్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు తెలిపారు. రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్‌లో ఐదేళ్ల అనుభవం ఉందన్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో 2024 ఫిబ్రవరిలో ఎన్‌టీఏ ప్రిలిమ్స్ రాసి మెయిన్స్‌కు అర్హత సాధించానన్నారు. మార్చిలో మెయిన్స్ రాయగా అక్టోబరు 9న ఫలితాలు వచ్చాయన్నారు. వారం రోజుల క్రితం డిప్యూటి డైరెక్టరుగా నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు తెలిపారు. డిసెంబరు 2న గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నేషనల్ హార్టికల్చర్ బోర్డు డిప్యూటి డైరక్టరుగా విధులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

తాత గారు స్ఫూర్తి

విద్య, ఇతర అంశాల్లో తన భుజం తట్టి అన్ని రకాలుగా తనను ప్రోత్సహించింది తల్లాదండ్రులేనని ఆమె తెలిపారు. ఉండి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా రిటైరైన తన తాతయ్య దివంగత చిట్టూరి సుందరరావు నియోజకవర్గంలోని ఉద్యోగులకు, వివిధ వర్గాల ప్రజలకు బాగా చేరువయ్యారన్నారు. ఆయన ప్రభావం కూడా కొంత ఉందని, ఆయన తనకు స్ఫూర్తి అన్నారు. వుందన్నారు. భర్త సన్నీ తాను పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇచ్చిన ప్రొత్సాహం మరువలేనన్నారు. నిస్సీ మేనత్త మేనమామలు ఉండి కృషి విజ్ఞాన కేంద్రం గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డిబోరా మెషియానా రత్నంరాజు, ఆశీర్వాదం, విక్టరు, హెన్రీ, కుటుంబసభ్యులు, స్థానిక సంఘ పెద్దలు నిస్సీని అభినందించారు.



ఏపీ నిట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- ఏపీ నిట్‌లో రాజ్యాంగ దినోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ యువశక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అంబేడ్కర్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ఆచార్యులు వినోద్ కుమార్‌రాజా, సౌమ్య జోస్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ ఎన్.జయరాం, అసోసియేట్ డీన్ వి.సందీప్, ఆచార్యులు టి.రమేష్, కిరణ్ కుమార్, నగేష్‌భట్టు, అరుణ్‌కుమార్, సీహెచ్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో..



అంబేద్కర్ చిత్రపటం వద్ద అధికారుల నివాళి

ఏలూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని జడ్పీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటి సీఈవో కె.భీమేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ వల్లే ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందని, అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఉద్యోగి విధులు, బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఏవోలు కూరపాటి జాన్సన్, భవాని, రజనీప్రభ, పద్మావతి, కనకదుర్గ, సీత, రాఘవులు, సరోజని, పాటు ఇతర జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వశిష్ఠ గోదావరి కాలుష్యంపై ఎన్జీటీ సమీక్ష

- 12న త్రిసభ్య కమిటీ పర్యటన

నరసాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వశిష్ఠా గోదావరి కాలుష్యంపై దాఖలైన పిటిషన్‌పై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు మంగళవారం త్రిసభ్య కమిటీ గూగుల్ మీట్ నిర్వహించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రాజ్యలక్ష్మి చెన్నై నుంచి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర కోస్టల్ జోన్ అథారిటీ, అధికారులు, నరసాపురం ఆర్డీవో దాసిరాజు పాల్గొన్నారు. కాలుష్యానికి దారి తీస్తున్న పరిస్థితులు, నివారణ, ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై త్రీసభ్య కమిటీకి నేతృత్వం వహిస్తున్న సెంట్రల్ బోర్డు అధికారి రాజ్యలక్ష్మి ఆరా తీశారు. దీనికి సంబంధించి వివరాలను ఆర్డీవో దాసిరాజు వివరించారు. వచ్చే నెల 12న నరసాపురం చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలిస్తామని కమిటీ సభ్యులకు ఆర్డీవోకు తెలియజేశారు. సుమారు అర్ధగంట గూగుల్ మీట్‌లో కాలుష్యంపై సమీక్షించారు. నరసాపురం పట్టణానికి చెందిన వ్యక్తి గోదావరి కలుష్యంపై ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తులు జస్టిస్ సుధీర్ అగర్వాల్, అఫ్రోజ్ అహ్మద్ నదీ జలాలు కలుషితంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకునేందుకు సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని ఈనెల 8న ఆదేశించారు. దానికి అనుగుణంగా చెన్నైలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి పరివేక్షణలో రాష్ట్ర కోస్టల్ జోన్ ఆధారటీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలు సంయుక్తగా కమిటీగా ఏర్పాడ్డారు. తొలి సమావేశాన్ని గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పర్యావరణానికి మేలు



మొక్కలు నాటుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పర్యావరణానికి మేలైనదని ఉద్యాన సహకారం మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ శాస్త్రంపై ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. బి.రాజశేఖర్ మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆదాయం పెంచడంతోపాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యమైన ఆహారం అందించవచ్చన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి బి.గోపాల్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం జీరో బడ్జెట్ వ్యవసాయంగా పేరొందిందని, రైతులంతా ఈ దిశగా సాగుకు ముందుకు రావాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ టి విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన విషయాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయం రైతుల ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపుతుందన్నారు. రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ ప్రవేశం లేదు



- ప్రవేశ పరీక్ష రాసి ఐదు నెలలు
- విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు
- కౌన్సెలింగ్ ప్రక్రియ ఎప్పుడు?
- విద్యార్థుల ఎదురుచూపు
- తల్లిదండ్రుల ఆవేదన

ఏపీఈఏపీ సెట్ ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్ నిర్దేశించే ప్రవేశ పరీక్ష. విద్యార్థుల తల్లిదండ్రుల కల నెరవేర్చే మార్గం. ప్రవేశ పరీక్ష ముగిసి నాలుగు నెలలైనా విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఏపీఈఏపీ సెట్ రాసిన ఎంపీసీ విభాగం విద్యార్థులకు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ముగిసి విద్యార్థులు కళాశాలల్లో చేరారు. వారికి తరగతులు ప్రారంభం కావడమే కాదు ఇంటర్నల్ పరీక్షలు రాస్తున్నారు. మొదటి సెమిస్టర్‌కు సన్నద్ధం అవుతున్నారు. బైపీసీ విభాగం విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టలేదు. ఫార్మసీ ప్రవేశాల కోసం విద్యార్థులు మూడు నెలలుగా ఎదురు చూస్తున్నారు.



భీమవరం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ ద్వారా బి ఫార్మశీలో చేరాలనుకునే విద్యార్థులు మూడు నెలలుగా వేచి చూస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇప్పటికి విడుదల కాలేదు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఉన్నత విద్య ప్రవేశాల ప్రక్రియ చేపడుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం దాదాపు అన్ని ఉన్నత విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. కానీ ఏపీఈఏపీసెట్ రాసిన ఇంటర్ బైపీపీ విభాగం విద్యార్థులను మాత్రం గాలికొదిలేసింది. ఈ విభాగం విద్యార్థులకు ఫార్మశీ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలపై ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన లేదు. విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు గడిచిపోయింది. మరికొన్ని విభాగాలకు తదుపరి విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షలకు (జేఈఈ మెయిన్స్) దరఖాస్తు ప్రక్రియ కూడా సాగుతోంది. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరం ఫార్మసీ ప్రవేశాల ప్రక్రియ మాత్రం పత్తా లేదు. బైపీపీ విభాగం విద్యార్థులకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఇంత వరకు ఏవిధమైన ప్రవేశ ప్రక్రియ చేపట్టకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఈఏపీ సెట్ ర్యాంక్‌తో అగ్రికల్చర్, హార్టికల్చర్ ప్రవేశాలు పూర్తికాగా ఏపీఎస్‌సీహెచ్‌ఈ చేపట్టాల్సిన ప్రకియ ఎందుకు జాప్యం చేస్తోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. బైపీసీ విభాగం విద్యార్థులకు ఫార్మసీతో పాటు కొన్ని యూనివర్సిటీల్లో బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలు చేపట్టాల్సి ఉంది.

ప్రవేశ ప్రక్రియ ఎప్పుడు?

నవంబరు ముగుస్తున్నా ఫార్మసీ ప్రవేశాలు ఎప్పుడు అనేది తెలియడం లేదు. ఏపీఈఏపీసెట్ రాసిన ఎంపీసీ విభాగం వారికి ఇంజనీరింగ్ తరగతులు మొదలై నెలలు గడుస్తుంది. మరో పక్క అగ్రికల్చర్, వర్కింగ్ కోర్సుల తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. బిఫార్మసీ, కొన్ని సాంకేతిక కోర్సుల ప్రవేశాలు మాత్రం నిలిచిపోయాయి. దీనితో విద్యార్థులలో ఒత్తిడి నెలకొంది. బి.ఫార్మసీలో సీటు రాకపోతే మరే ఇతర కోర్సుల్లో చేరే అవకాశాలు కోల్పోయినట్లేని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 కళాశాలలు

ఉమ్మడి గోదావరి జిల్లాలో ఏడాది నుంచి కొత్తగా వచ్చిన రెండు ఫార్మసీ కళాశాలతో కలిపి 12 ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 1200 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో 920 సీట్లే ఉండగా ఈ ఏడాది 180 సీట్లు పెరిగాయి. బి ఫార్మసీలో చేరాలనుకునే విద్యార్థులకు అదనంగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సెలింగ్ ఆలస్యం సీట్ల భర్తీపై ప్రభావం ఉంటుందని కళాశాల యాజమాన్యా లు కూడా ఆందోళన చెందుతున్నాయి. బి.ఫార్మసీ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిపై గందరగోళంతో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు కౌన్సెలింగ్ నోటిఫికేషన్ కోసం చూస్తున్నారు. కొన్ని కళాశాలలకు విద్యార్థుల తల్లితండ్రులు ఫోన్‌చేసి కౌన్సెలింగ్ ఎప్పుడు అంటూ పదే పదే అడుగుతున్నారు.

ఎందుకీ జాప్యం..!

బి ఫార్మసీ విద్యార్థులకు విద్యా సంవత్సరం జాప్యం కావడం కరోనా విపత్తు సమయం నుంచి కొనసాగుతోంది. 2021లో కరోనా కారణంగా ప్రవేశాల్లో జాప్యం జరిగింది. తర్వాతి సంవత్సరం నుంచి కూడా ఏదో కారణంతో జాప్యమవుతోంది. గత ఏడాది నవంబర్‌లో కౌన్సెలింగ్ జరిగింది. ప్రస్తుతం ఫార్మసీ కౌన్సిల్ అనుమతుల్లో ప్రతిష్టంభన కారణంగా జాతీయ స్థాయిలోనే జాప్యమైందని పలువురు చెబుతున్నారు. రెండు వారాల క్రితం ఫార్మసీ కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ప్రభుత్వం కౌన్సెలింగ్ ప్రకటన ఇవ్వలేదు. ప్రవేశాల జాప్యంతో విద్యార్థులకు కోర్సు సెమిస్టర్ పరీక్షలు బాగా వెనుకగా సాగుతున్నాయి. విద్యా సంవత్సర విధానమే మారిపోయింది.

ఒకేసారి కౌన్సెలింగ్ చేపట్టాలి

బి ఫార్మసీ కౌన్సింగ్ తీవ్ర జాప్యమైంది. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా కౌన్సిలింగ్ ప్రక్రియకు 15 రోజులు పడుతుంది. డిసెంబర్ నెలాఖరుకు గానీ ప్రవేశాలు పూర్తి కావు. జనవరిలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఏపీఈఏపీ సెట్ రాసిన ఎంపీసీ, బైపీసీ రెండు విభాగాల విద్యార్థులకు ఒకే సారి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తల్లిదండ్రులకు ఒత్తిడి



బిఫార్మసీలో ప్రవేశానికి విద్యార్థులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రోజూ ఎన్నో ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఇంకా ఎన్ని రోజులు పడుతుందని అడుగుతున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడితే వారిలో ఒత్తిడి తగ్గుతుంది.

– డి.రాఘవ, ప్రిన్సిపాల్, కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల

మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా

ఫార్మసీ చదవాలనుకుంటున్నాను. మూడు నెలలు నుంచి కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నాను. కౌన్సిలింగ్ తేదీ కూడా ప్రకటించ లేదు. తల్లిదండ్రులు వేరే కోర్సులలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారు. బి ఫార్మసీ చదివితే బాగుంటుందని నేను అనుకుంటున్నాను.

కె.సుజన, బైపీసీ విద్యార్థిని

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్
- ముగిసిన పదోన్నతి అర్హత పరీక్షలు



శిక్షణను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, నేర స్థలంలో అంశాలపై సిబ్బందికి శిక్షణ

పెదవేగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సబ్ ఇనస్పెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం (డీటీసీ)లో పోలీస్ ఉద్యోగులకు పదోన్నతి అర్హత పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరు రేంజ్ పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి పదోన్నతుల పరీక్షలు సోమ, మంగళవారం రెండురోజుల పాటు జరిగాయని చెప్పారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు మొత్తం 115 మంది అభ్యర్థులకు ఎస్‌ఐలుగా పదోన్నతులకు అర్హత పరీక్షలు నిర్వహించామన్నారు. పటిష్ఠ భద్రత నడుమ పరీక్షలు జరిగాయని ఆయన చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామన్నారు. రాత పరీక్షలతోపాటు రెండో రోజు మంగళవారం నేర స్థల పరిశీలన, నేరం జరిగిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలు వివరించామన్నారు. పదోన్నతి పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు కల్యాణ్ డ్యామ్ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఆరు వారాల శిక్షణ ఉంటుందని, అనంతరం వారు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందుతారని ఆయన వివరించారు. 4వ బెటాలియన్ కమాండెంట్ సీవీపీ.రామకృష్ణ, ఏలూరు ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ.ప్రసాదరావు, తూర్పుగోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఏఎస్పీ చెంచురెడ్డి, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ ఎస్.శేఖర్, రేంజ్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, మహిళా ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెరిగింది

భీమవరంటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాల ఉత్పత్తి పెరిగిందని, ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉందని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. భీమవరం పశు సంవర్థక శాఖ కార్యాలయంలో జాతీయ పాల ఉత్పత్తి ప్రాముఖ్యత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ వర్గీస్ కురియన్ మిల్క్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని, పాల దినోత్సవం కేవలం పాల వేడుక కంటే చాలా ఎక్కువ అన్నారు. సామాజిక, ఆర్థిక పరివర్తనకు గుర్తింపు అన్నారు. జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ పాడి పరిశ్రమ, సుస్థిరత, ఆవిష్కరణ, చేరికపై దృష్టి సారించి, దేశంలో వృద్ధికి, ఆహార భద్రత, గ్రామీణాభివృద్ధి సాధికారతకు మూల స్తంభంగా ఉందన్నారు. ఈ అంశాలు డాక్టర్ కురియన్ వారసత్వం మనకు గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీ సత్యనారాయణ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని దెబ్బతిన్న కారు, విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- కూలిన స్తంభం.. పెద్దగా మంటలు

పెంటపాడు, నవంబరు 26 (పెంటపాడు): పెంటపాడు గేటుసెంటర్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొట్టింది. స్తంభం విరిగిపడి పెద్దగా మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న కారు పెంటపాడు గేటు సెంటర్ సమీపంలోని స్తంభాన్ని ఢీకొంది. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. ఏం జరిగిందో తెలియక మంటలను చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదంలో స్తంభం విరిగిపోవడంతో తెల్లవారుజాము 3 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఏఈ పద్దరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. జరిగిన ప్రమాదం కారణంగా విద్యుత్ శాఖకు సుమారు రూ 50 వేలు నష్టం వాటిల్లినట్లు ఏఈ పద్దరాజు తెలిపారు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి గాయాలు

టి.నరసాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు గాయపడ్డారు. ప్రమాద సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. చింతలపూడి మండలం సుప్రీంపేటకు చెందిన కొండపల్లి నగేశ్, పగడం ప్రవీణ్ ఈనెల 24న జంగారెడ్డిగూడెం వెళ్ళి తిరిగి చింతలపూడి బయల్దేరారు. స్థానిక హైస్కూల్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. వెంటనే బంధువులు చింతలపూడి అక్కడ నుంచి విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహాలు ఎన్ని.. ఏంచేశారు..?

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 8 గంటల సుదీర్ఘ విచారణ

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీ అనాథ మృతదేహాలు ఎన్ని.. వాటిని ఏం చేశారని విచారణాధికారి మంగళవారం సుదీర్ఘ విచారణ చేపట్టారు. మార్చురీలో మృతదేహాల మాయంపై విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రాష్ట్రస్థాయి అధికారి వెంకటేష్ మంగళవారం విచారణ చేపట్టారు. ఉదయం 9.30 గంటలకు నేరుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చేరుకుని సాయంత్రం 5.30 గంటల వరకూ విచారించి వాగ్మూలాలను నమోదు చేశారు.

ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీ అనుబంధ టీచింగ్ ఆసుపత్రి (ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి)గా మారిన తరువాత ఎన్ని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. గుర్తించని అనాథ మృతదేహాలు ఎన్ని.. వాటిని ఎవరికి అప్పగించి ఖననం చేయించారు.. అందుకు సరైన పత్రాలను పరిశీలించారు. సంబంధిత ఫోరెన్సిక్ విభాగానికి సంబంధించిన వైద్యులు, సిబ్బంది, మార్చురీ అసిస్టెంట్లు, ఇతర జీడీఏలు, కొంతమంది వైద్యులను కూడా ఈ విచారణకు పిలిచి వాంగ్మూలాలను నమోదు చేశారు. మార్చురీ రిజిస్టర్లలో కొన్ని పేజీలు మాయమైనట్లు సమాచారం. డీఎంఏ అధికారులు మాత్రం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నివేదికను డీఎంఈ డైరెక్టర్‌కు అందించనున్నట్లు తెలిసింది. మార్చురీలో మృతదేహాల మాయం కావడంలో ప్రధానంగా ఆరుగురి పాత్ర ఉన్నట్లు గుర్తించి విచారణకు పిలిచారని ఆసుపత్రి వర్గాలు చెప్పుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో సంబంధిత వ్యక్తులపై చర్యలు డీఎంఇ అధికారులు ఆదేశాలు జారీ చేస్తారని తెలిసింది.

ఫోన్ లాక్కుని.. డేటా చోరీ

భీమవరం క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తన ఫోన్ లాక్కుని మేసేజ్, డేటా ఇతరులకు ఇస్తున్నాడని నరసింహపురం కార్యదర్శి ములపర్తి సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన పెన్మెత్స కృష్ణంరాజు ఫిర్యాదుపై డీపీవో ఆదేశాలతో ఈనెల 23న ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం కృష్ణంరాజు సెక్రటరీ సాయిబాబాను బెదిరించి దౌర్జన్యంగా ఫోన్ లాక్కుని వెళ్ళిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌లో ఉన్న డేటాను ఇతరులకు పంపించి తన ఉద్యోగానికి ఆటంకం కలిగిస్తున్నట్లుగా ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామానికి చెందిన కాకి రాఘవులు (44)కు భార్య పిల్లలు ఉన్నారు. మంగళవారం ఉదయం తన భార్య పిల్లలను కైకలూరులో దించి తిరిగి ఏలూరు వస్తుండగా ఏలూరు రూరల్ మండలం గురకలపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

జామాయిల్ కలప తరలించే లారీ సీజ్



దర్భగూడెం ప్లాంటేషన్‌లో లారీని పరిశీలిస్తున్న అధికారులు

జీలుగుమిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జామాయిల్ కర్రలు అక్రమంగా తలించడానికి వచ్చిన లారీని సీజ్ చేసినట్లు ఏపీఎఫ్‌డీసీజిల్లా మేనేజరు సౌజన్య చెప్పారు. దర్భగూడెం 2007లో నాటిన జామాయిల్ తోటను ఆమె పరిశీలించారు. ఇటీవల సంబంధిత అధికారుల అనుమతితో జామాయిల్ కటింగ్ అనంతరం సన్నపుల్ల తరలించడానికి కాంట్రాక్టు పొందిన వారికి అనుమతి ఇస్తే తీసుకువెళ్లే వీలుందన్నారు. ఇక్కడ సన్నపుల్ల మాటున ఎండిన జామాయిల్ కర్రలు(దుంగలు) నరికి తరలించే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయమై జంగారెడ్డిగూడెం పీఎం(ప్లాంట్ మేనేజరు) వసంతకుమారిని లారీ సీజ్ చేయమని ఆదేశించారు. అనంతరం సంబంధిత బాధ్యులపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎం చెప్పారు. రెహమాన్, రామాంజనేయులు, వాచర్లు ఉన్నారు.

మలేషియా పంపి.. మోసగించారు

భీమవరం క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తనను ఉపాధి నిమిత్తం మలేషియా పంపించారని, అక్కడ జీతం ఇవ్వలేదని, వెనక్కి తీసుకురావాలని కోరినా పట్టించుకోవడం లేదని మోటుపల్లి వారి వీధికి చెందిన కోట నాగరాజు పోలీసులకు పిర్యాదు చేశారు. నాగరాజును ప్లంబింగ్ పనికి మలేషియా పంపిస్తానని ప్రకాష్‌నగర్‌కు చెందిన రేవు రామలక్ష్మి రూ.1.50 లక్షలు తీసుకుంది. నాగరాజు మలేషియాలో హోటల్‌లో పనికి కుదిరాడు. వారు జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. తన భర్తను వెనక్కి రప్పించాలని రామలక్ష్మిని నాగరాజు భార్య కోరింది. ఆమె పట్టించుకోకపోవడంతో తెలిసిన వారి ద్వారా ఇమిగ్రేషన్ విమానంలో నాగరాజు తిరిగి వచ్చాడు. రామలక్ష్మిని డబ్బు ఇవ్వాలని గట్టిగా అడిగితే బెదిరించిందని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

పామాయిల్ పరిశోధనా కేంద్రం సందర్శన

ఏలూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పెదవేగిలోని పామాయిల్ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. ఫీల్డ్‌ట్రిప్ ద్వారా విద్యార్థులు ప్రేరణ పొందుతారని ప్రిన్సిపాల్ గిరిబాబు పేర్కొన్నారు. పరిశోధనా కేంద్రం డైరెక్టర్ కె.రమేష్, కళాశాల సీపీడీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు వెంకట్రావు, విజయ్‌కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనసమారాధన

చింతలపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి సమీపంలోని తలార్లపల్లి వద్ద ఆలపాటి సత్యనారాయణ తోటలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరినీ ఆహ్వానించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

లింగపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కే. గోకవరం పీహెచ్‌సీలో మోటపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కళ్లలో శుక్లాలు, ఇతర ఇబ్బందులు ఉన్నవారిని ఎంపిక చేసి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి కళ్లజోళ్లు అందిస్తామని వారు తెలిపారు. కె. గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్, సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఏలూరు టూ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన సీనియర్ నాయకుడు నేతల రమేష్ బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా 75వ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుం టున్న సమయంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం దారుణమన్నారు.

బుట్టాయగూడెం: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంశం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తేవాలన్నారు.

కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

కుక్కునూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సొసైటీ ద్వారా తీసుకున్న గ్యాస్ కనెక్షన్లు రద్దు చేసి కొత్త కనెక్షన్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బొయ్యన శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2016లో గిరిజన, ప్రైమరీ, కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా దీపం పథకం కింద ఇండియన్ గ్యాస్ అనుబంధంతో కనెక్షన్లు ఇచ్చారన్నారు. ఆ కనెక్షన్ నుంచి సిలిండర్ తీసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.



తీరిన మొక్కు

పెదవేగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెంకటకృష్ణాపురంలోని నాగవీరాంజనేయస్వామికి టీడీపీ నాయకులు 1008 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యేగా చింతమనేని ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో పాటు టీడీపీ అధికారంలోకి రావాలని కోరుతూ మొక్కుకున్నామని, నెరవేరడంతో మొక్కులు చెల్లించామని టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ తెలిపారు.

జర్నలిస్టులు కీలకం : ఎమ్మెల్యే

పెదవేగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సులో జర్నలిస్టులది కీలకపాత్ర ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆహ్వానించడానికి మంగళవారం దుగ్గిరాల వెళ్ళిన జర్నలిస్టులతో ప్రభాకర్ మాట్లాడుతూ కుటుంబం కన్నా సమాజం కోసమే ఎక్కువ సమయం కేటాయించే జర్నలిస్టుల నిబద్ధత హర్షించదగ్గదని ఆయన పేర్కొన్నారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండలం రాజవరంలో ఓ వైసీపీ నాయకుడు ఆ భూమిని ఆక్రమించి అందులో ఉన్న పంటను ధ్వంసం చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కొయ్యలగూడెం మండలం రాజవరం రెవెన్యూ గ్రామంలో ఆర్.యస్.నెంబర్ 219-2లో రెండెకరాల 44 సెంట్లు భూమి ఉందని, ప్రభుత్వం షరతుల గల పట్టా మంజూరు చేసిందని ముంగమూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పొలానికి రెండో సరిహద్దు దారుడు అయిన రాజవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడి పొలం ఉందన్నారు. రెండేళ్ళ క్రితం తమ భూమిని అమ్మమని అడిగితే తాము అమ్మబోమన్నారు. అయితే ప్రస్తుతం అక్కడ కొబ్బరిమొక్కలు నాటామన్నారు. గత నెల కిరాయి మూకలను తీసుకువచ్చి తమ పొలంలో కొబ్బరిమొక్కలు నరికివేసి వేళ్ళను ట్రాక్టర్‌తో పెకిలించివేశాడని, తమను బెదిరించాడని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించి పొలం తాము చేసుకునేలా చూడాలని బాధితుడు జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి రత్న ప్రసాద్



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్, తపనా చౌదరి


పూళ్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు

రాజ్యాంగాన్ని అందరూ తెలుసుకోవాలి

రాజ్యాంగ దినోత్సవంలో వక్తలు

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత పౌరులు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవించాలనే ఉద్దేశ్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షతన రాజ్యాంగాన్ని రూపొందించారని ఈ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె. రత్న ప్రసాద్ అన్నారు. సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కాలేజీలో భారత రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించాలే కానీ వరకట్నాన్ని ప్రోత్సహించరాదని సూచించారు. న్యాయవాదులు పి. రత్నరాజు, కోనే సునీత, సెట్వెల్ సీఇవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలి : ఎస్పీ

ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమానంగా పాటుపడాలన్నారు. దేశ ప్రజలందరూ కులమత తారతమ్యాలు లేకుండా జీవించాలన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు.

రాజ్యాంగం సామాన్యుల రక్షణ గోడ..

ఏలూరు రూరల్: రాజ్యాంగ స్ఫూర్తి బావితరాలకు తెలిసేలా ప్రతి ఇంట్లో రాజ్యాంగ ప్రతులు ఉండాల్సిన అవసరం ఉందని, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజ్యాంగ ప్రాధాన్యత, ఆదేశిక సూత్రాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా రాజ్యాంగ ప్రతులను కొనుగోలుచేసి తమ ఇంట్లో ఉంచుకోవాలన్నారు. నవంబరు 26 నుంచి జనవరి 26 వరకు బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ మహోత్సవ్ నిర్వహించాలన్నారు.

ఏలూరు అర్బన్: డీఈవో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈవో షరీఫ్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, రాజ్యాంగ ప్రాధాన్యతను ఉద్యోగులకు గుర్తుచేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ గిరిబాబు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ నగర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేశారు. ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు స్టీవెన్ పాల్గొన్నారు. ఏలూరు ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్ బాబు, హెడ్‌పోస్ట్ మాస్టర్ డి.రంగారావు, పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.జమ్లా తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పాఠశాల విద్య కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకుని (ఆర్జేడీ) పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు కాకినాడలో నిర్వహించిన పలు పోటీల్లో జిల్లాస్థాయి విజేతలుగా స్థానిక శ్రీ శర్వాణీ స్కూలు విద్యార్థులు బహుమతులు అందుకున్నట్టు స్కూలు హెచ్‌ఎం సత్యశారద తెలిపారు. కాకినాడ ఆర్జేడీ నాగమణి బహుమతులు అందజేశారని స్కూలు డైరెక్టర్ మదనమోహనరాజు వివరించారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులకు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

ఏలూరు టూ టౌన్: ఎంపీ కార్యాలయంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు. భారతరాజ్యాంగం పవిత్ర గ్రంథమని ఎస్సీ, ఎస్టీ బహుజన ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షులు నేతర అజయ్‌బాబు అన్నారు. శ్రీవైష్ణవి జూనియర్ కాలేజీలో భారత రాజ్యాంగ దినోత్సవం జరిగింది.

చింతలపూడి: చింతలపూడిలో పలు చోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలకుర్తి నాగేశ్వరరావు, కంచర్ల బుచ్చిబాబు, మద్దా ఆనంద్, భానుకుమార్, అనీష్‌కుమార్, రవికుమార్, ముక్తేశ్వరరావు, కాంతారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు: అంబేడ్కర్ ఆశయ సాధనకు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దెందులూరు తహసీల్దార్ బి. సుమతి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

లింగపాలెం: అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు అన్నారు. లింగపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

పోలవరం: గూటాల జడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు భారత రాజ్యాంగం అంశాలపై క్విజ్, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎస్ఎస్, పొలిటికల్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.విజయబాబు, అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పెదవేగి: రాజ్యాంగంతోనే దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యపడిందని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. అమ్మపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు లభించాయని భీమడోలు సీఐ విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమల ప్రధానకూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని ప్రతి పౌరుడు రాజ్యాంగం గొప్పదనాన్ని తెలుసుకోవడానికే నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు.

జంగారెడ్డిగూడెం: రాజ్యాంగ దినోత్సవం వైసీపీ పట్టణ అధ్యక్షుడు సిహెచ్ అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుర్నాథరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పోలసానపల్లిలో 150 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

పెదపాడు: భారత రాజ్యాంగ, జాతీయ న్యాయ దినోత్సవం పెదపాడు, వట్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా జరిగాయి. వట్లూరులో ఏలూరు డీపీవో కె.అనురాధ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ దేశ గౌరవాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి హెచ్.ఎం. పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

భీమడోలు: పూళ్ళ జడ్పీ హైస్కూలులో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు 150 అడుగుల జెండాతో ప్రదర్శన నిర్వహించారు.

టి.నరసాపురం: మండలంలో రాజ్యాంగ దినోత్సవం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.సాగర్ విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. చట్టం ముందు అందరూ సమానులే అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు.


ఆరబోసిన ధాన్యపు రాశులు

తుఫాన్ హెచ్చరికలతో రైతుల బెంబేలు

చింతలపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 15 రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. తేమ ఆరేందుకు బరకాల కోసం కొందరు రైతులు పరుగులు పెడుతుండగా, ఆరిన ధాన్యాన్ని తరలించడానికి గోనె సంచులు లేక గోనె సంచుల కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల జేసీ తనిఖీల్లోనూ గోనె సంచులే మయ్యాయంటూ ప్రశ్నించారు. తుఫాను హెచ్చరికలతో ధాన్యం తరలించడానికి, వరికోత యంత్రాల కోసం రైతులు పరుగులు పెడుతున్నారు.

గిరిజనుల ఎదుగుదలకు ప్రణాళికలు వేయండి

బుట్టాయగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆర్థిక ఎదుగుదలకు, జీవనోపాధి మెరుగు పడటానికి అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. విజయవాడ ట్రైకార్ కార్యాలయంలో అధికారులు, ట్రైకార్ సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయడంలో సభ్యులు సహకారం అందించాలన్నారు.


ట్రైకార్ బోర్డు సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించిన చైర్మన్ బొరగం శ్రీనివాసులు

భక్తాంజనేయుడికి పూజలు

పోలవరం: పోలవరంలో స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నంగినీడి బాలకృష్ణ, యెక్కిశెట్టి వెంకటరాజా తదితరులు పాల్గొన్నారు.



వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల హర్షాతిరేకాలు

ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతునొక్కేందుకు గత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కె.ఆర్ సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం పట్ల మంగళవారం ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం వద్ద ధర్మపాలనలో న్యాయం గెలిచిందంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి సీఎం చంద్రబాబునాయుడికి మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు కి.జె శేషుకుమార్, సెక్రటరి శివప్రసాద్, కిరణ్, సూరజ్, హమీద్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.


నూతన యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆయుర్వేద చికిత్సలకో యాప్

ఏలూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య చికిత్సలందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'దేశ్ కీ ప్రకృతి పరీక్షన్ అభియాన్' మొబైల్ యాప్‌ను ఆయుష్ శాఖ జోన్-2 ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ కల్పన కటాక్షం మంగళ వారం ఏలూరులో ఆవిష్కరించారు. ఏలూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం సంబంధిత వ్యక్తి మొత్తం సమాచారాన్ని నమోదుచేస్తే అతని ఆరోగ్యతత్వం నిర్ధారణ అవుతుందన్నారు. దీనికనుగుణంగా ఆ వ్యక్తికి ఆయుర్వేద వైద్య విధానంలో సత్వర చికిత్స అందించేందుకు వైద్య నిపుణులకు సమాచారాన్ని పంపించడం జరుగుతుందన్నారు. యాప్ డౌన్‌లోడ్, ఆరోగ్య సమాచారం నమోదు కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా మంగళవారం నుంచి డిసెంబరు 25 వరకు జిల్లాలోని అన్ని ఆయుష్ వైద్యశాలల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.లక్ష్మీసుభద్ర, ఆయుర్వేద వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మర్రిగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న సున్నపురాళ్ళపల్లిలో ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన కామ్రేడ్ సత్తిరాజు సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరాంజనేయులు సత్తిరాజు స్మారక స్థూపం వద్ద జెండా ఎగురవేసి మాట్లాడుతూ కామ్రేడ్ సత్తిరాజు మర్రిగూడెం ప్రాంతంలో రాజీలేని పోరాటం చేసి భూస్వాముల కుట్రలను తిప్పికొడుతూ వందలాది ఎకరాల భూములను ప్రజలకు పంచారన్నారు. కూటమి ప్రభుత్వం ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిప్పించాలన్నారు. మంజూరుచేసి, వ్యవసాయానికి రుణాలిచ్చి ఆదివాసీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. అదేవిధంగా మండలాన్ని ఐటిడిఏ పరిధిలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు- కూలీ సంఘం నాయకులు బి.రమేష్, కొండా రాము, బాబురావు, రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, శ్రీకాంత్, ఆరు గ్రామాల ముఖ్యులు పొట్టా రామారావు, కురసం నిరీక్షణరావు, చిన్న వెంకటేశ్వరరావు, వీరస్వామి, నాగేశ్వరరావు, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్ భవన్‌లో ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విజయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఎస్ఈ సాల్మన్‌రాజు మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో 365 రోజులు వినియోగదారుల సేవలో పనిచేస్తున్న ఉద్యోగులకు వైద్య సౌకర్యం వల్ల మెరుగైన సేవలు అందించటానికి వీలవుతుందన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.ఎమ్ అంబేద్కర్, టి.శశిధర్, రాధాకృష్ణ, సురేష్‌కుమార్, నాయకులు తురగా రామకృష్ణ, సిహెచ్ సాయిబాబా, ఎం.రమేష్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

టొబాకో మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నిక

ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) ది ఏలూరు టొబాకో మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా మాధవరావు, కార్యదర్శిగా బలభద్ర రామయ్య, ఉపాధ్యక్షుడిగా సుంకాబత్తుల ప్రకాష్, కోశాధికారిగా ఎం.రవి, సభ్యులుగా టి.రమణ, నాగం శివ, ఎస్.కె సుబ్బారావు ఎన్నికయ్యారు. తొలుత అసోసియేషన్ గత ఏడాది జరిగిన ఆర్థిక లావాదేవీల పై చర్చించారు. అనంతరం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నాగం శివ వ్యవహరించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

పోలవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) భారత రాజ్యాంగాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని నిత్యావసరాల ధరలు తగ్గించి రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. పోలవరం అంబేడ్కర్ సెంటర్ లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కరించాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మద్దికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి మంగళవారం సందర్భంగా గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వామిని దర్శించుకోగా ఈవో ఆర్.వి.చందన ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు. వివిధ సేవల రూపంలో ఆలయానికి రూ.7,30,906లు సమకూరినట్లు ఈవో చందన తెలిపారు. మండలంలోని చక్రదేవరపల్లి గ్రామస్తులు స్వామివారి నిత్య అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కుక్కునూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరులో అంగన్వాడీ మినీ వర్కర్ల సమావేశంలో పాముల అన్నపూర్ణ, మంగా, భవాని, వందన, నాగమణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి కుర్చీల వితరణ

కామవరపుకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గ్రామానికి చెందిన కొత్తూరి అర్చన కుర్చీలను అందచేశారు. అంగన్‌వాడీలు బోధించేందుకు అనువుగా మరో రెండు కుర్చీలను అందించారు. సెక్టార్ సూపర్ వైజర్ బి.వి.ఎల్.మంగాదేవి, కె.డి.ఎం.ఎస్.కుమారి తదితరులు పాల్గొన్నారు.



● కళలే కీలకం

ఏలూరు టూ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజ ఉద్ధరణకు కళలే కీలకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శ్రీరామ్‌నగర్‌లోని గంగానమ్మ ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం చిన్నారుల కోలాట నృత్యాన్ని తిలకించారు. చోడే వెంకటరత్నం, శ్రీనివాస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



● ఘనంగా సెమీ క్రిస్మస్

పెదపాడు: పునుకొల్లు సీఎస్ఐ చర్చిలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతమనేని పాల్గొన్నారు. తొలుత సీఎస్ఐ ప్యారిస్ గురువులు రెవ. డి.విజయానంద్, పొలిమెట్ల బాబురావుతో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ శ్రావణి, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, అక్కినేని వంశీకృష్ణ, కొత్తూరు చినబాబు, సర్పంచ్‌సునీల్‌కృష్ణ పాల్గొన్నారు.



●108 కలశాలతో శోభాయాత్ర

జీలుగుమిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మంగళవారం పురస్కరించుకుని మహిళలు 108 కలశాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆ జలంతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కె.చిరంజీవిశర్మ, టిఎస్.రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మండల దీక్ష చేపట్టిన స్వాములు, మహిళలు ఉన్నారు.




రమణక్కపేటలో విద్యార్థుల ప్రదర్శన, సూరంపాలెంలో నాయకుల ప్రతిజ్ఞ

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ఆత్మలాంటిది

చాట్రాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ఆత్మలాంటిదని, ప్రతి పౌరుడు రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. సూరంపాలెం అమృత్ సరోవర్ వద్ద మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అనంతరం నాయకులు అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన అవకాశాలు కల్పించారన్నారు. గౌడ బజార్ స్కూల్, చాట్రాయి హైస్కూల్, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, బుర్రి శ్రీకర్, కందుల కృష్ణ, తల్లాడ శ్రీను, నక్కా రాము, ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సోషల్ వర్కింగ్ మోడల్స్

ముసునూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట జడ్పీ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు సంయుక్తంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎస్కె షకీలా విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన సోషల్ వర్కింగ్ మోడల్స్ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యారు్థలకు ప్రోత్సాహక బహుమతులను హెచ్ఎం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్పీవో సుందరి, ఎంపీడీవో జి.రాణి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

● నూజివీడు: పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని త్రివిధ పాఠశాల విద్యార్థులు అంబేడ్కర్, రాజ్యాంగ కమిటీ సభ్యుల వేషధారణలో ఆకట్టుకున్నారు. గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాధికారాణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగం ప్రాముఖ్యత వివరించారు. ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులు అని ఆమె వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించిన విద్యార్థులు



పోలీస్‌స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

ఆగిరిపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూరవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆగిరిపల్లిలో రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేయబడిన ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. తహసీల్దార్, మండల పరిషత్, విద్యాశాఖ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, ఎస్‌బీఐ సందర్శించి కార్యాలయ అధిపతులను కలిసి ప్రజలకు అందించే సేవలను తెలుసుకున్నారు. తహసీల్దార్ పీఎన్‌వీ.ప్రసాద్, ఎంఈవో సర్వేశ్వరరావు, ఎస్ఐ శుభశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం రోజున ప్రభుత్వ కార్యాలయాల సందర్శన అభినందనీయమన్నారు. రాజ్యాంగం హక్కులతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం అంకం వెంకటేశ్వరరావు, సగ్గూరు కాంప్లెక్స్ సిఆర్‌పి రామారావు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ డేటా సమగ్రంగా ఉండాలి



ఆన్‌లైన్ డేటా పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ముసునూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ డేటా సమగ్రంగా ఉండాలని డీఎల్‌పీవో సుందరి అన్నారు. ముసునూరు, వలసపల్లి గ్రామ పంచాయతీల ఆన్‌లైన్ డేటాను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో గృహాల కొలతలు, పన్నుల వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బీఏ.సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకున్న కృష్ణా మిల్క్ యూనియన్



పాడి రైతులను సత్కరిస్తున్న ఆంజనేయులు

ఆగిరిపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లభించని పాడి రైతులకు ఒక వరంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఏర్పడిందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శ్వేతవిప్లవ పితామహులు డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి రాజవరం పాలసంఘం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. బడుగు గ్రామీణ అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందన్నారు. పాడి రైతులను చైర్మన్ చలసాని అంజనేయులు ఘనంగా సత్కరించారు. 10 శాతం వెన్న ఉన్న లీటర్ పాలు రూ. 90 కృష్ణా యూనియన్ చెల్లించనుందన్నారు. వినియోగదారు దగ్గర తీసుకున్న ప్రతి రూపాయిలో 80శాతం పైబడి తిరిగి రైతుకే చెల్లిస్తున్న ఏకైక సహకార సంస్థ కృష్ణామిల్క్ యూనియన్ అని తెలిపారు. జిల్లా బోర్డు డైరెక్టర్ పల్లగాని కొండలరావు, గ్రామసర్పంచ్ జాల భూషణం, గన్నవరం క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, సంఘ రామకూరి కిరణ్‌మధు, అనిల్ కుమార్, వీరాంజనేయులు, పాడి రైతులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులపై సొంత పార్టీ నేత ఫిర్యాదులు సరికాదు

నూజివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పదవిలో ఉన్న టీడీపీ నేత ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సొంత పార్టీ నేతలపై ఆరోపణలు, ఫిర్యాదులు చేయడం తగదని, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ శివ నాగమణి అన్నారు. వారు మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పాటుపడుతుంటే ముద్దరబోయిన అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. రావిచర్లలో గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ జరుగుతుందని ముద్దరబోయిన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియకుండా ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. తప్పుడు ఫొటోలు చూపి కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించే విధంగా ముద్దరబోయిన వ్యవహరించారన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయనున్నామని కాపా శ్రీనివాసరావు తెలిపారు. కోరారు. సమావేశంలో గ్రామపార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపీటీసీలు చెన్నకేశవరావు, లావు ప్రసాద్ పాల్గొన్నారు.

చెల్లని చెక్ కేసులో ఆరు నెలల జైలు

నూజివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఎ.కొండూరు గ్రామానికి చెందిన బాలమూరి నాగపద్మకు ఆరునెలలు జైలుశిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు. 2018 అక్టోబర్‌లో గంపలగూడెం మండలం వినగడప గ్రామానికి చెందిన కోటగిరి రాహుల్, సమీపబంధువు అయిన నాగపద్మకు రూ.5లక్షలు అప్పు ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించాలని రాహుల్ కోరగా నాగపద్మ 2019 జూలైలో రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంకులో బౌన్స్ అయింది. అనంతరం రాహుల్, నాగపద్మపై కోర్టుకు వెళ్లారు. కేసు విచారించిన కోర్టు మంగళవారం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

నూజివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి చాట్రాయి మండలాల్లోని మద్యం దుకాణదారులు నిబంధనల విక్రయాలు సాగించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బెల్టుషాపులు సమాచారం 9949539933 నెంబర్‌కు అందించాలని వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నూజివీడు పట్టణం గాంధీనగర్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న కలవకొల్లి రాజమ్మ దుకాణంపై మంగళవారం దాడిచేశారు. ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణ

చాట్రాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం వీరాంజనేయస్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి దంపతులు మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అన్నదానం నిర్వహించారు. దేశిరెడ్డి రాఘవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరించారు.

అయ్యప్ప ప్రతిమతో ఊరేగింపు

ఆగిరిపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ఆఖరి ఏకాదశి సందర్భంగా గ్రామంలోని పలువురు అయ్యప్ప భక్తులు అయ్యప్పస్వామి వారి పంచలోహ విగ్రహాన్ని శిరస్సుపై ధరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఇలాంటి ఊరేగింపు గ్రామంలో మొదటిసారిగా చూడటంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించి భక్తి పారవస్యం పొందారు.

సమస్యలు పరిష్కరించండి

ముసునూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చింతలవల్లిలో ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం, అధ్వానంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని పిల్లి నాగేంద్రబాబు కోరారు. ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు పి.వరకిశోర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చర్చి వద్ద ఒరిపోయిన విద్యుత్ స్తంభం సమస్యను ట్రాన్స్‌కో ఏఈ వీరబాబు డ్రైనేజీ సమస్యను సర్పంచ్, కార్యాదర్శి దృష్టికి తీసుకువెళతానని వరకిశోర్ తెలిపారు.

ఆ ఊర్లో ఎవరూ మద్యం ముట్టరు. ఒకవేళ ఎవరైనా కళ్ళుగప్పి నాలుగు చుక్కలేసుకుని ఊళ్లోకి వచ్చి యాగీ చేసినా వెయ్యి రూపాయల పెనాల్టీ. ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా పరిష్కరించుకుంటారు. పోలీస్‌స్టేషన్ గడప తొక్కరు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎవరికి కష్టం వచ్చినా.. నష్టం వచ్చినా ఊరంతా తోడుగా నిలుస్తుంది. ఆఖరికి స్థానిక సంస్థల ఎన్నికల్లోను ఎవరంతట వారు పోటీపడరు. పంచాయతీ ఎన్నికల్లో ఊరిదంతా ఒకే మాట.. ఏకగ్రీవమే.. ఇక్కడ ఆదర్శ రైతులు ఒకప్పుడు సత్కారాలు పొందారు. ఊళ్లో బహిరంగ మల విసర్జన అప్పటి నుంచి ఇప్పటిదాకా నిషేధమే. న్యాయవాదులు, న్యాయమూర్తులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి అభినందించినవారే. గ్రామ పెద్ద పున్నయ్య స్ఫూర్తితోనే ఇదంతా సాధ్యమైతే విజేత యువజన సంఘం అక్షరాలా అమలు చేస్తోంది. ఆ ఊరి కథ కమామిషు ఏమిటో తెలుసుకుందామా..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



అమ్మతోడు..



- ఈ.. ఊరిలో మద్యం తాగితే అంతే సంగతులు
- తాగి ఊగితే వెయ్యి జరిమానా
- కట్టుబాటు.. క్రమశిక్షణ తప్పరు..
- స్థానిక సంస్థల్లోను ఏకగ్రీవమే
- వివాదాలకు చాలా దూరం
- గడిచిన రెండేళ్లలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కేసులు రెండే
- చంద్రబాబు, పవన్ రాక కోసం ఎదురుచూపు

అమ్మపాలెం ఊరి కథ ఇది

ఆ ఊరి జనాభా వెయ్యిలోపే. అంతా రైతువారి కుటుంబాలు. రోజువారి కుటుంబాన్ని సాకేందుకు కాయకష్టమే. కాని నూరుశాతం కట్టుబాటు, క్రమశిక్షణ. ఒకరికొకరు దూషించుకోరు. ఎక్కడా ఎవరూ ఘర్షణలకు దిగరు. చిన్నాచితక కోపతాపాలు వచ్చినా సర్దుబాటు చేసుకుంటారు. తగాదా మరింత వివాదాస్పదమైతే ఊరి పెద్దల తీర్పే శిరోధార్యం. మద్యానికి అత్యంత దూరం. మహిళలకు మరింత గౌరవం. ఇక్కడ కాస్తోకూస్తో చదువుకున్న వారే ఎక్కువ. కాని ఎక్కడా బేషజాలకు పోరు. ఆ ఊరి పేరు జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం. ఈ ఊరిలో గడిచిన 24 ఏళ్ళుగా మద్యం అమ్మకాలు గాని, మద్యం సేవించేవారికి చోటే లేదు. 24 ఏళ్ల క్రితం 15 మందితో ఏర్పడిన విజేత యువజన సంఘం దీనికి నాంది పలికింది. ఊరిని చైతన్యపరిచింది. ఆదిలో మీ పెత్తనం ఏమిటని ఎదురు తిరిగినవారు ఉన్నారు. తాగితే తాగుతాం..మా ఇష్టం అంటూ కొందరు ఎదురు తిరిగారు. ఏం చేస్తారో చేసుకోండంటూ సవాళ్లు విసిరారు. కాని రానురాను ఊరి బాగోగుల కోసమే యువకులంతా ఏకమై ఊరి గుట్టు బజారు పాలుకాకుండా శ్రమించారు. తొలుత వ్యతిరేకించిన వారే కొద్దికొద్దిగా మెతకపడడం ప్రారంభించారు. దీనివెనుక గ్రామంలోని మహిళల పాత్ర అత్యంత కీలకం. తమ ఇంట్లో వారు ఎక్కడెక్కడ మద్యం సేవించి వస్తున్నారో ఆరా తీసి మరీ యువజన సంఘానికి ఉప్పందించేవారు. ఇంకే ముంది అంతా ఏకమై చాటుమాటున మద్యం విక్రయించేవారిని చాన్నాళ్ల క్రితమే తరిమేశారు. ఊళ్ళో ఎక్కడా బెల్టు షాపు పెట్టకుండా కఠిన నిర్ణయం అమలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము నమ్మిన సిద్ధాంతానికి ఊరు శాంతియుతంగా ఉండేందుకు కుటుంబ తగాదాలకు, భూతగాదాలకు, రాజకీయ తగాదాలకు మద్యం కారణం కారాదని ధృడ సంకల్పంతో పట్టువీడకుండా యువజన సంఘం ప్రయత్నించింది.

చుక్క ముట్టుకుంటే.. ఒట్టు

విజేత యువజన సంఘంతో పాటు గ్రామ పెద్దలు నిర్ణయాల మేరకు అమ్మపాలెం గ్రామంలో మద్యం సేవించడం పూర్తిగా నిషేధం. అంతకంటే మించి అమ్మకాలకు తావులేదు. గడిచిన రెండున్నర దశాబ్దాల కాలంగా ఊరు ఊరంతా ఇదే కట్టుబాటు పాటిస్తుంది. ఎన్ని విధానాలు మారినా, మరెన్ని ప్రభుత్వాలు మారినా ఈ ఊరి మాట.. బాట ఒక్కటే. ఎట్టి పరిస్థితుల్లోను మద్యాన్ని సేవిస్తే ఊరి శాంతియుత వాతావరణానికి విఘాతమని భావిస్తారు.. సుమారు 200 గడపలు ఉన్న ఈ

మద్యం ముట్టరు..

గ్రామంలో అత్యధికులకి మద్యం అలవాటే లేదు. కేవలం వ్యవసాయం..కుటుంబ పోషణ అనే రెండు విధానాలు మాత్రమే తెలుసు. అంతకంటే మించి అసాంఘిక కార్యకలాపాలకుగాని, ఇతరత్రా ఘర్షణలకు గాని ఎవరూ తావివ్వరు. ఒకవేళ చాటుమాటున ఎవరైనా మద్యం సేవించి ఊళ్ళోకి వచ్చి వివాదం సృష్టిస్తే మాత్రం వారికి వెయ్యి రూపాయలు పెనాల్టీ. ఈ పెనాల్టీ మొత్తం కట్టి తీరాల్సిందే..మద్యం సేవించిన వ్యక్తికి మద్దతుగా ఎవరూ నిలవనే నిలవరు. ఈ ఊళ్లో బెల్టు షాపు పెట్టేందుకు జరిగిన ప్రయత్నాలన్నింటినీ విఫలం చేశారు. చాన్నాళ్ళ క్రితం ప్రతీ పదకొండేళ్ళకు జరిగే గంగానమ్మ జాతర సందర్భంగా కొందరు ఇక్కడ మద్యం దుకాణం తెరిచేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. దానికి ఊరు ఊరంతా ససేమిరా అంది. బెల్టుషాపు పెట్టాలనుకున్న వారిని తరిమేశారు. దీనికంతటికి అప్పటి గ్రామ పెద్ద సురవరపు పున్నయ్య స్ఫూర్తి. ఆయన కనుసన్నల్లోనే ఊరంతా క్రమశిక్షణతో మెలిగేది. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా, నష్టం వచ్చినా ఊరంతా వాలి పోయేది. అంతలా తీర్చిదిద్దారు పున్నయ్య. ఆ తరువాత కూడా ఎక్కడా ఊరు క్రమశిక్షణ తప్పలేదు.

రాజకీయాలకు చోటు లేదు

అమ్మపాలెంలో ఎక్కడా రాజకీయ తగాదాలకు ఆస్కారమే లేదు. గడిచిన రెండు దఫాలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లోను అంతా ఏకగ్రీవమే. ఏ ఒక్కరు మాకు కావాలంటే.. మాకు కావాలని పోటీలు పడలేదు. అందరూ ఏకతాటిపై నిలిచి ఏకగ్రీవం చేశారు. దీనికితోడు సాధారణ ఎన్నికల్లో రాజకీయ పక్షాలు ఏమైనా ఓట్ల కోసం నోట్లు వల విసిరినా అదే కట్టుబాటు. గ్రామస్తుల్లో అత్యధికులు చేతికందివ్వడానికి వచ్చిన ఓట్ల సొమ్ములను తిరిగి వెనక్కి ఇచ్చేశారు. తమకు ఇలాంటి అరువు అవసరం లేదంటూ నేరుగానే తిప్పికొట్టారు.

ఊరికోసమే అంతా

తాము ఏమి చేయదలచుకున్నా అంతా ఒక్కటై చేస్తారు. ఒకరికొకరు కూడబలుక్కుని తుది నిర్ణయం తీసుకుంటారు. ఆ నిర్ణయానికే అందరూ కట్టుబడతారు. విభేదాల మాట ఇక్కడ వినపడదు. ఆఖరుకి గడిచిన కొన్ని సంవత్సరాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల సంఖ్య ఒకట్రెండు. స్థానికంగా చిన్నచిన్న తగాదాలు, పొలం తగాదాలు, మాట జారిన విషయాలు ఏదైనా సరే అందరు కలిసి కూర్చొని పరిష్కరించుకుంటారు. స్టేషన్ మెట్లెక్కడం వీరికి అలవాటే లేదు. ఆదర్శ గ్రామమంటే ఇలా ఉండాలని అందరికీ అమ్మపాలెం స్ఫూర్తిదాయకమవుతుంది. కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉన్న ఈ గ్రామంలో సమస్యలు మాత్రం అనేకం. మద్యం నిషేధం దగ్గర నుంచి క్రమశిక్షణతో మెలుగుతున్న ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సింది పోయి ఇప్పటికీ చూసీ చూడనట్టుగానే వ్యవహరిస్తున్నారు.

మా ఊరు రండి..

తాము నిక్కచ్చిగా ఊరి కోసం చేస్తున్న ప్రయత్నాలను, వాటి ఫలితాలను స్వయంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తమ గ్రామానికి రావాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఆశించినట్టుగా బహిరంగ మలవిసర్జనను ఇక్కడ నిరోధించాం. ప్రభుత్వపరంగా కార్యక్రమాల అమలులో తప్పు దొర్లకుండా చూస్తున్నాం. వ్యవసాయ పరంగా రైతులకు అందే సహాయాలను పర్యవేక్షిస్తున్నాం. కాని ఇలాంటి ఊరికి కూడా అనేక సమస్యలు న్నాయి. వచ్చీపోయేందుకు రహ దారి అత్యంత ఘోరంగా ఉంది. ఊరి శివారున ఉన్న కాలువ దాటేందుకు కష్టసాధ్యమైన పరిస్థితి నెలకొంది. ఊరి లోపల అంతర్గత రహదారుల అవసరం లేకపోలేదు. ఇలాంటి వన్నీ పూర్తి కావాలి. దూర ప్రాంతాలకు వెళ్ళే పిల్లల చదువులకు ఒకింత ఊతమివ్వాలి. రోజువారి జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతా లకు అవసరాల నిమిత్తం వెళ్ళే ప్రజలకు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ ఊరిని ఆదర్శంగా తీసుకుని ఇప్పటికే న్యాయవాదులు, న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు అనేకమార్లు వచ్చి వెళ్ళారు. ఆదర్శ గ్రామాన్ని ఆదరించండి.. అంటూ గ్రామస్తుల వేడుకుంటున్నారు..

మహిళలు అండగా నిలిచారు



కమిటీ ఏర్పడిన మొదట్లో మద్యం నిషేధించడానికి మూడు సంవత్సరాల పాటు చాలా ఇబ్బందులు పడ్డాం.గ్రామ పెద్దలు, గ్రామస్తులు కొందరు వ్యతిరేకించారు. ఆ సమయంలో గ్రామ మహిళలంతా మాకు తోడుగా నిలబడటం వల్ల నేడు మా గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం చేయగలిగాం. మా కమిటీని సభ్యులను ఆదర్శంగా తీసుకుని గ్రామంలో నలభై మంది యువకులు ప్రతీ నెల కొంత డబ్బు దాచి కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తున్నారు.

జెల్లా సత్యనారాయణ (సాయి) విజేత యువజన సంఘం అధ్యక్షుడు, అమ్మపాలెం

గ్రామంలో వివాదాలకు తావులేదు



విజేత యువజన సంఘం గ్రామంలో చేసే కార్యక్రమాలకు ఆకర్షితుడినయ్యాను. గ్రామంలో వివాదాలకు తావేలేదు. నా పొలంలోకి వెళ్లడానికి దారి లేకపోవడంతో పక్క భూమి వ్యక్తితో గొడవలు జరుగుతున్న సమయంలో కమిటీ సభ్యులు జోక్యం చేసుకుని వివాదాలు లేకుండా సరిచేశారు. నాకు నా పొలంలోకి వెళ్లడానికి దారి చూపించారు. మొదట తగాదా పడిన ఇద్దరం ఇప్పుడు స్నేహభావంతో ఉంటున్నాం. నేను కూడా గ్రామానికి ఏదో ఒక మంచి పని చేయాలని ధృడసంకల్పంతో ఉన్నాను.

గవిరిశెట్టి రత్తయ్య,టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు

ఒకప్పుడు విపరీతంగా తాగేవారు



1998 కు ముందు మా గ్రామంలో మద్యం అమ్మకాలు విపరీతంగా ఉండేవి. పగలు,రాత్రి తేడా లేకుండా మద్యం తాగుతూ కొందరు గ్రామంలో ప్రశాంతత లేకుండా చేసేవారు. ఇళ్లల్లో ఆడవారిని కొట్టేవారు. ఆ సమయంలో కొంతమంది మహిళలు గ్రామంలో ఉన్న యువకులమైన మా దగ్గరకు వచ్చి తమ సమస్య చెప్పారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరగ కుండా చూడాలని కోరారు. గ్రామ పెద్ద సూరవరపు పున్నయ్య సహకా రంతో ఆనాడు మొదలైన ఉద్యమం గ్రామస్తుల సహకారంతో నేటికీ కొనసాగుతోంది.

సూరవరపు రాంబాబు,విజేత యువజన సంఘం ప్రధాన కార్యదర్శి



కైకలూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, ఎస్సీ సెల్ నాయకులు



ముదినేపల్లి మండలం శ్రీహరిపురం ఎలిమెంటరీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



కలిదిండిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కైకలూరు/ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని కైకలూరు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగాన్ని పురస్కరించుకుని కైకలూరులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నేతలు, దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు ఎండీ జానీ, ఎస్సీ సెల్ నాయకులు వాసిపల్లి సతీష్‌కన్నా, జక్కుల విజయ కుమార్, సదర్ల సూరి, గాలి ప్రసాద్, జయ కుమార్ పాల్గొన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటం నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైశ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు. ఏలూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ముదినేపల్లిలో స్థానిక ఐటీఐ కళాశాల విద్యార్థులు మన రాజ్యాంగం - మన స్వాభిమానం పాదయాత్రను నిర్వహించారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్స్ ప్రసన్న, జగదీష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. కలిదిండిలో దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు దాసరి అబ్రహం లింకన్, కురేళ్ల ఏడుకొండలు, మద్దిరాల జోసెఫ్, బళ్లా రాజు పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాల వద్ద సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, పంచాయతీల కార్యదర్శులు నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద ముదినేపల్లి గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు నిమ్మగడ్డ కైకమ్మ, పరసా విశ్వేశ్వరరావు, వల్లభనేని లక్ష్మి, గంటా రాకేష్‌కుమార్, మరీదు దుర్గశ్రీ పాల్గొన్నారు. మండవల్లిలో, లోకుముడిలోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండవల్లిలో భారతీయ జనతాపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, బీజేపీ నాయకులు కోకా శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు సమయం ఏసుబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషీద్, తదితరులు పాల్గొన్నారు. మండవల్లిలో సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ అధ్యక్షుడు కె.శాంతరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

షష్టి ఉత్సవ కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ కమిషనర్ కేడర్ టెంపుల్ అయిన సింగరాయపాలెం, చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి బ్రేక్ పడింది. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం నుండి నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో షష్ఠి కల్యాణోత్సవాల లోపు మండలి నియామకం జరిగే అవకాశాలు లేకుండా పోయాయి. డిసెంబరు 6 నుంచి 19 వరకు ఈ దేవస్థానంలో జరగనున్న షష్ఠి కల్యాణోత్సవాలకు ఉత్సవ కమిటీ నియామకం జరగనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే కామినేని, ఉత్సవ కమిటీ నియామకానికి ఎన్డీయే నాయకు లతో చర్చించిన అనంతరం దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్‌కు లేఖ పంపనున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రం దినోత్సవం సందర్భంగా చినతాడినాడ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు సాంఘిక వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సుమారు 100 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని సోషల్ ఉపాధ్యాయుడు పి.దామోదర్‌రావు తెలిపారు. సర్పంచ్ ఏసుబాబు, మాజీ సర్పంచ్ కృపారావు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న తహసీల్దార్, మాస్టర్ ట్రైనీలు

నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని తహసీల్దార్ ఎస్‌కె.సుభానీ అన్నారు. ముదినేపల్లిలోని వి.కన్వెన్షన్ హాలులో మంగళవారం మండల పరిధిలోని 13 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమితులైన పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించి వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ, మాస్టర్ ట్రైనీలు నాగేశ్వరరావు, మారుతీ, పీవో, ఏపీవో, ఇతర సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.